71

కనిపించని గాయం

"పార్వతీ! పార్వతీ!" హడావుడిగా ఇంట్లోకి వచ్చిన విశ్వం, హాల్లో ఈజీఛేర్‌లో వెనక్కు వాలి.... వేళగాని వేళ నిద్ర పోతున్న పార్వతిని చూచి నిర్ఘాంతపోయాడు క్షణకాలం. మరుక్షణంలో, అందాకా అతగాడిలో పొంగివున్న ఉత్సాహం చప్పున చల్లారిపోయింది.

పార్వతి ఆ సరికే త్రుళ్ళిపడి లేచింది.

"ఏమిటీ? మళ్ళీ జ్వరం వచ్చిందా? కంగారుగా పార్వతి నుదుటి మీద చెయ్యివేస్తూ అడిగాడు విశ్వం.

"లేదు లోపలికి పదండి. మీకు కాఫీ యిస్తా!" అతగాడి చెయ్యి తీసివేస్తూ, నిర్లిప్తంగా లోపలికి నడిచింది పార్వతి,

ఆమె వెనుకనే వస్తున్న విశ్వం, బలహీనంగా వున్న పార్వతినీ, తూలుతున్నట్లున్న ఆమె శరీరాన్ని చూస్తూ "పార్వతి ఎలా మారిపోయిందీ?" అన్న జాలితో సతమతమై పోయాడు క్షణకాలం.

గ్లాసుతో కాఫీ తెచ్చి, టీపాయ్ మీద పెట్టి, తిరిగి వంటింట్లోకి వెళ్ళి, ఏదో పని చూసుకుంటోంది పార్వతి.

విశ్వానికేదో చికాకుగా వుంది.... మరేదో అక్కసుగా వుంది.... ఇంకేదో ఆకర్షణ లోపల్నుంచి ఎగసి వస్తోంది....

మనసు కళ్ళెంలేని గుఱ్ఱంలా చిందులు తొక్కుతోంది....ఏదో స్థిర నిర్ణయానికొచ్చినట్లు, బాత్ రూం కేసి నడిచాడు. వంట ఇంట్లో పీటమీద కూర్చుని, గోడనానుకొని కళ్ళు మూసుకొని వుంది పార్వతి....

"మందులు టైంకు వేసుకున్నావా పార్వతీ?" వెళ్తూ వెళ్తూ ఒక్క నిముషం ఆగి, యాంత్రికంగా అడిగాడు.

"ఆఁ!" అదే నిర్లిప్తమైన జవాబు.

బాత్ రూంలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. అతగాడి మనసులో చికాకు. పార్వతిలో శారీరకంగానే కాదు, మానసికంగా కూడా వచ్చిందేదో మార్పు. రానీ! అందుకు నేనేం బాధ్యుణ్ని కాను....డాక్టరుకు చూపించాను....మందు లిప్పిస్తున్నాను. విశ్రాంతి కేం లోటులేదు. ఇక ఆమెలో బలమూ, ఉత్సాహము రాకపోతే నేనేం చెయ్యగలను? నా సరదాలు ....నా సంతోషం.... అన్నీ....ఛీ....ఛీ! నీళ్ళు గుమ్మరించుకుని బాత్ రూంనుంచి బయటపడ్డాడు. ఐదు నిమషాల్లో డ్రెస్ చేసుకున్నాడు. "నే వెళుతున్నా పార్వతీ! తలుపేసుకో. బహుశా పిక్చర్ కు వెళ్తామేమో ఫ్రెండ్స్ అందరం....నా కోసం ఎదురుచూడక, భోజనంచేసి పడుకో!"

వరండా చీడీలు దిగుతూ వెనుదిరిగి చూశాడు. హాల్లో ద్వారబంధం ఆనుకుని నిల్చుని తనవేపే చూస్తోంది పార్వతి.

పీక్కుపోయిన ముఖంతో, గుంటలుపడ్డ కళ్ళతో, పాలిపోయి చెక్కినట్లున్న బుగ్గలతో, ఊడిపోయిన పిచ్చి జుట్టుతో, ఎండిపోయిన గుండెలతో....ఛీ....ఛీ....దెయ్యంలా

వున్న ఈ పార్వతిని ఎలా భరించటం? ఎవరో తరుము తున్నట్లు గబగబ వీధిలోకి నడిచాడు విశ్వం.

"ఇదేమిటక్కయ్యా! ఇదేదో ఎయిత్ వండర్‌లా వుంది! విశ్వం బావగారు ఒంటరిగా ఈ మధ్య సినిమాలకూ, షికార్లకు చెక్కేస్తున్నారు!" ఎదురింటి శారద పరుగెత్తుక వచ్చి పార్వతిని అడిగింది....ఏదో ఆలోచిస్తున్న పార్వతి శారద మాటలతో ఉలిక్కిపడింది. "అదేం లేదు....నాకే ఏమిటో ఓపిక లేక రాలేనన్నాను" నవ్వేస్తూ అంది పార్వతి.

"భలేదానివే! పిక్చర్ కెళ్ళటానికి ఓపిక లేకపోవట మేమిటి? మా వారు నన్నడగాలేగానీ, నూటనాలుగు డిగ్రీల జ్వరంలో నయినా సరే....తయారై వెడతాను!"

"సర్లె! నువ్వంటే చిన్న పిల్లవు.... మొన్న మొన్న పెళ్ళయిన దానివి...."

"నువ్వేమరి ముసలి ముత్తైదువవు! ఛాల్లే అక్కయ్యా! ఇదో పాట నేర్చుకున్నావీ మధ్య! అన్నిటికీ పెద్దదాన్ని....ఓపిక లేదు...." అంటూ. ఓపిక మనం తెచ్చుకోవాల్సిగానీ' దానం తటదే చస్తే రాదు....హమ్మయ్యో! స్టౌమీద చారు పొంగి పోయిందో ఏమిటో.... నే వెళ్ళొస్తా!" సుడిగాలిలా వచ్చి నంత వేగంగానూ వెళ్ళిపోయింది శారద.

శారద మాటలెందుకో వెన్ను చరిచి నట్లయ్యాయి పార్వతికి. తనే ఓపిక తెచ్చుకోవాలా? ఎలా? ఎవరి కోసం.... అంతటి నీరసంలోనూ, మేడ మీదకు వెళ్ళింది పార్వతి.

విశ్వం కోసం చూపులు వీధి కొసవరకూ వెళ్ళి తిరిగి వచ్చాయి....అక్కడే....ఆ వీధి మలుపులోనే....మొన్ననో రోజు....ఇదే వేళలో, వాళ్ళ ఆఫీస్ టైపిస్ట్ దేవకితో.... నవ్వుతూ మాట్లాడుతూండటం తను చూచింది. ఆ రోజూ.... ఇలాగే పిక్చర్‌కు....వంటరిగా, కనీసం తనను మాటమాత్రంగా నైనా "వస్తావా?...."అనేనా అడక్కుండా వెళ్ళాడు!

ఆ మటుకూ తనేం చదువురాని మనిషి కాదు....కాల స్వభావాన్నీ, మనుష్యుల మనస్తత్వాన్నీ వాతావరణ ప్రభావాన్నీ అర్థంచేసుకోలేని అవివేకురాలు కాదు. ఆడదిగానీ, మగాడుగానీ, సంఘంలో, పదుగురిలో తిరగవలసి వచ్చినపుడు సరదాగా నవ్వుకోవటం, 'జోక్స్' ఎంజాయ్ చెయ్యటం లాటివి 'నైతిక పతనం' అనే హెడ్డింగ్ క్రిందకు త్రోసివేసే కుసంస్కారి కాదు....

కానీ....ఆ దేవకి మొన్ననో రోజు ఇంటికి వచ్చింది.

"ఏమిటండీ పార్వతీ! మీరిలా తగ్గిపోతున్నారు!" అంది ఆశ్చర్యంగా తన కేసి పరకాయించి చూస్తూ.

"మొన్న మీరు చూచినప్పటి కంటే మెరుగ్గా లేనూ?"....అంది తను నవ్వుతూ.

"ఏం మెరుగో! ఎముకలు బయట పడ్తున్నాయి!" అనేసింది దేవకి.

"ఎక్కాకీ! కొన్నాళ్ళకి సైన్సు లేబొరేటరీలో స్టాండ్‌కి తగిలించవలసి వస్తుందేమో మా ఆవిడని...." అన్నాడు

విశ్వం కొంత కోపం, మరికొంత తెచ్చుకోలు నవ్వూ, మిళిత మైన కంఠస్వరంతో.

"ఛీ....ఛీ....అలా మాట్లాడుతారేమిటి?...." చను వుగా మందలించింది దేవకి. "మంచి మెడిసిన్స వాడ రాదూ?" అంది చక్రాల్లాటి కళ్ళు....అందంగా తిప్పుతూ.

"ఒక మందా? ఒక డాక్టరా? పార్వతినే అడగండి కావలిస్తే....ఫారిన్ రిటర్న్డ్ డాక్టర్స....స్పెషలిస్ట్స....ఒక రేమిటి? ఖాళీ మందు బాటిల్సతో ఓ అల్మైరా నిండి పోయింది! పొరబాటుగా ఎవరేనా మా ఇంట్లోకి అడుగు పెడ్తే! ఇదేదో డిస్పెన్సరీ అనుకుంటారు.... ఏదీ మా పార్వ తిలో మార్పు వస్తేనా? పర్మనెంటు పేషంటులా తయారౌ తోంది!....అసలు మీ ఆడవాళ్ళంతా ఇంతేనేమో! లావె క్కటం మొదలెడితే, ఇక ఆగకుండా అడ్డం పెరిగిపోతారు.... సన్నబడటం ప్రారంభిస్తే....అస్థిపంజరాల్లా మారిపోతారు."

"నేను అడ్డం పెరిగిపోతున్నానంటారా, కొంపదీసి!" దేవకి భయంగా అడిగింది. తనను తాను చూచుకుంటూ.

"నో-నో...మీరు లావనిపించరు. హెల్దీగా, హాయిగా వుంటారు.... దేనికైనా పెట్టిపుట్టాలి. ఆరోగ్యమే అష్టైశ్వ ర్యాలు, అనారోగ్యమే సిసలైన దరిద్రము-అంటారందుకే...."

వాళ్ళిద్దరి సంభాషణలో, శ్రోతగా మిగిలిపోయిన తను ఎలా ఫీలౌతోందన్నది ఇద్దరూ పట్టించుకొనేలా లేరు! మౌనంగా కూర్చుండిపోయింది.

దేవకిని సాగనంపటానికి వెళ్లాడు విశ్వం. అప్రయత్నంగా వరండాలోకివచ్చింది పార్వతి. కబుర్లలోపడి అక్కడ లైటు వెయ్యలేదు ఇందాకా! హాల్లో లైటు కొద్దిగా వరండా ప్రక్కగా ప్రసరిస్తోందంతే....వరండా ప్రక్కన పొదలా అల్లుకుంటున్న 'క్రీపర్సు' మాటున-దేవకి చుట్టూరా చేతులు వేసి, గుసగుసగా ఏదో చెబుతున్నాడు విశ్వం. 'షాక్' తిన్నట్లయింది క్షణ కాలం. సంబాళించుకొని, సవ్వడి కాకుండానే తిరిగివచ్చేసింది లోపలకు.

దేవకి గేటుదాటి వెళ్ళాక, పొంగి పొరలుతున్న ఉత్సాహంతో లోపలకు వచ్చాడు విశ్వం.

"ఎలా అయినా దేవకి 'బ్యూటిఫుల్ ఫిగర్' కదూ పార్వతీ? ఆట్టే పొడగరి కాకున్నా-మాంఛి ఆరోగ్యంతో, నవనవలాడే యాపిల్ పండులా వుంటుంది....మిసమిసలాడే ఆమెను చూస్తుంటే, డన్‌లప్ పిల్లోస్....బెడ్స్ గుర్తుకు వస్తాయి కదూ?"

"అవును!"

అప్పుడుగానీ తలెత్తి పార్వతి వేపు చూడలేదు విశ్వం. ఏదోలోకంలో తేలిపోతున్నట్లున్న అత..డి ఆనందానికి 'వాక్యూమ్ బ్రేక్' పడిపోయింది!

"ఓ సారీ! జలసీ, దై నేమ్ ఈజ్ వుమన్!" అన్నాడు తన మాటల్ని ఎగతాళి క్రిందికి మార్చేస్తూ.

"నో-నో.... డైనేమ్ ఈజ్ మెన్ !" నవ్వేస్తూ అంది పార్వతి. ఇద్దరూ నవ్వుకున్నారు. కానీ ఆ నవ్వులో నిండుదనం, నిండు హృదయం, హాయి లేవని ఇద్దరికీ తెలుసు....

ఆ రాత్రంతా తనకు నిద్రపట్టలేదు. విశ్వంలో ఎందు కంతటి మార్పు వస్తోంది ?

తనకి ఫ్లూరావటంతన తప్పా ! అది న్యుమోనియాగా మారటం తన తప్పా ? ఆ తర్వాత నెల తిరక్కుండా తిరిగీ టైఫాయిడ్ అటాక్ కావటం తన బాధ్యతా ? ఆరోగ్యం క్షీణించింది. జుత్తువూడిపోయింది. ఆ సమయంలో కొద్దిగా కోలుకున్నంతలో విశ్వానికి క్యాంపులూ, తనకు ఇంటి దగ్గర పని మనిషి రాకపోవటం, తప్పనిసరిచాకిరీతోడుకావటంతో టైఫాయిడ్ తిరగబెట్టింది. అది తనని జీవచ్ఛవంలా మార్చి వదిలింది !

ఏ మాత్రం పని, శ్రమ తగిలినా గుండెనొప్పి, ఆయాసం, జ్వరం ముంచుకు వస్తున్నాయి. కనీసం ఆరు నెలలేనా విశ్రాంతి, బలమైన ఆహారం, మానసికమైన ప్రశాం తత చాలా అవసరమని చెప్పారు డాక్టర్లు.

ఆ మందులూ వాడతోంది. ఆహారం పుచ్చుకొం టోంది. కానీ, రోజులు జరుగుతున్న కొద్దీ,విశ్వం ప్రవర్త నలో, మాటలలో మార్పు తనని చిత్ర హింస చేస్తున్నాయి. మానసికంగా ప్రశాంత తన్నది లేకుండా చేస్తున్నాయి.

విశ్వం మేనకోడలు మీనాక్షి పొట్టిగా, లావుగా వుం టుంది. మొహం మాత్రం చాలా బాగుంటుంది.

"మీ మీనాక్షి చాలా బావుంటుంది. లక్ష్మీకళ....
అంది తనోమారు. అప్పట్లో తను ఆరోగ్యంగా వుంది.

"ఎవరు? మీ మీనాక్షా? దాని దో అందమా! అదెలావుంటుందో సరైన వుదాహరణ నే చెప్పనా? తెల్లనిపీపా బోర్లించి, దానిమీదో చిన్న చెంబు బోర్లించి, చుట్టూరా పట్టుచీరె చుట్టబెడితే ఎలా ఉంటుందో....సరిగ్గా అలాగే వుంటుంది! పార్వతీ! మెరుపు తీగలా, సన్నగా, పొడుగ్గా వుండే నువ్వే ఎంతో అందంగా వుంటావు! నువ్వు మాత్రం ఎప్పుడూ అలా లావుకావద్దు. నే భరించ లేను!" అనేవాడు విశ్వం.

"ఒకవేళ లావెక్కితే? ముప్ఫైఏళ్ళు వచ్చేసరికి, ఆడవాళ్ళు వద్దన్నా లావైపోతారుట! ముఖ్యంగా పిల్లలు పుట్టాక...." అంది తను ఉడికిస్తూ.

"పిల్లల జంజాటం ఇప్పట్లో మనకొద్దు. ఇక ముప్ఫై ఏళ్ళ సంగతంటావా? నీకు ఒళ్ళు వస్తోందన్న అనుమానం నాకు తగలగానే....ఆహార నియమం అమలు పరిపిస్తాను నీచేత. వ్యాయామం చేయిస్తాను. ఈత నేర్పిస్తాను. మైళ్ళ కొద్దీ నడిపిస్తాను.... హాయిగా తెగనవ్వకుండా లేనిపోని చికాకులు కల్పిస్తాను...."

అలా అన్న విశ్వం, ఈనాడు రుబ్బుడు పొత్రంలా వున్న దేవకిని అంతలా మెచ్చుకుంటున్నాడు, హత్తుకుంటు

న్నాడు ! దీనంతటికీ తన అనారోగ్యం ఒక్కటే కారణమా ?

* * *

"పార్వతీ ! పార్వతీ !"

క్రిందనుంచి పిలుపు వినిపించటంతో, ఆలోచనల్లో విహరిస్తున్న పార్వతి మెట్లుదిగి పరిగెత్తుక వచ్చింది. ఆయాసం వచ్చేసింది. విశ్వం హాల్లో నిల్చునివున్నాడు.

"ఏమిటిది పార్వతీ ! తలుపులన్నీ బార్లా తీసిపెట్టి, మేడమీదకు వెళ్లావేమిటి ?"

"ఇప్పుడిప్పుడే వెళ్లాను లెండి, ఆరేసిన బట్టలు తేవటానికి ! మీరు పిక్చర్‌కు వెళ్ల లేదా ! ఇంకా తొమ్మిది గంటలు కాలేదు !"

"ఊహూఁ ఓ ఫ్రెండింట్లో కూర్చుని వస్తున్నానంతే ! అక్కడే భోజనం చేశాను. నువ్వు తిన్నావు కదా !"

"ఊఁ !"

"మంచి పని చేశావ్ !" పార్వతివేపు పరిశీలనగా చూచివుంటే, ఆమె భోజనం చెయ్యలేదని తెలిసివుండేది !

కాని ఆ ఓపికతగాడికిప్పుడు లేదు. అతగాడిమనస్సు ఇంకా దేవకి చుట్టూరానే పరిభ్రమిస్తోందని పార్వతికిట్టే అర్థమైపోయింది.

"మందులు వున్నాయా? రేపు తేవాలా!" పక్కమీద పడుకుంటూ అడిగాడు విశ్వం.

"వున్నాయి."

"రక్షించావు."

పది నిమిషాల నిశ్శబ్దం తర్వాత మెల్లిగా అన్నాడు విశ్వం.... "ఓ మాట చెప్పనా పార్వతీ!"

"చెప్పండి!"

"మగాడికి ఇద్దరు భార్యలు అవసరం!"

"ఎందుకూ?" అనలేదు పార్వతి. ఇంతక్రితం తనని వుడికించటానికి, తనతో గిల్లికజ్జా పెట్టుకోటానికి ఆ మాట అంటూనే వుండేవాడు విశ్వం....ముఖ్యంగా నెల నెలా రెండు మూడు రోజులు....అతగాడే వంటపనీ, ఇంటిపనీ చూచుకో వలసి వచ్చినప్పుడు అందంగా చిరాకుపడ్తూ అనేవాడు. "ఇలాటి సందర్భాలలో మగాడికి ఇంకో భార్య అవసరమోయ్ పార్వతీ! హాయిగా నీ లీవ్ పీరియడ్‌లో, ఆవిడ ఇంటిపని చూచుకుంటుంది!"

"ఆ తర్వాత?" అని తనడిగితే.

"దేవుళ్ళ పెద్ద భార్యలలానే మిగతారోజుల్లో ఆవిడ, తులసిపూజ, అత్తమామలసేవ, అతిథిసేవ చేసుకుంటుంది." అలాటి పరిహాసం ధ్వనించడంలేదీరోజు, అతగాడి కంఠ స్వరంలో ఏదో సిద్ధాంతాన్ని దృఢపరుస్తున్నట్లుందా గొంతు.

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL, GUNTUR.

"ఏం పార్వతీ! పలకవు?" విశ్వం తిరిగి అన్నాడు.

"ఏం పలకను? మీరు చెప్పండి." నవ్వటానికి ప్రయత్నిస్తూ అంది పార్వతి!

ఆ వెన్నెలలో....నవ్వబోతున్న ఆమెపళ్ళు, కళ్ళు వెళ్ళి వచ్చి, చాలా అసహ్యంగా వున్నట్లు తోచింది విశ్వానికి.... దేవకి గుర్తుకువచ్చింది....ఇంత క్రితం దేవకితో తను సరదాగా ....సంభాషించిన మధురఘట్టం గుర్తుకు వచ్చింది, తిరిగీ వుత్సాహం పొంగిం దతగాడిలో....

"దేవకి ఈ రోజు ఓ కొత్త డిజైన్ చీరె కట్టుకొంది పార్వతీ! చాలా బావుందది!" యాదాలాపంగా పార్వతిని పొదివి పట్టుకున్నాడు విశ్వం. అతగాడి మనస్సు నిండా దేవకి రూపం పరుచుకునివుంది.

"అబ్బా!" అప్రయత్నంగా మూలిగిందది పార్వతి. ఆమె గుండె లోతుల్లో ఏదో బాధ, శారీరకమైన బలహీనత' అత గాడి బాహువలయంలోని కాఠిన్యం, క్షణకాలం ఊపిరి సలప నివ్వలేదామెకు.

గబుక్కున ఆమెను వదిలి, లేచికూర్చున్నాడు విశ్వం. అతగాడి కళ్ళముందు పార్వతిస్పష్టంగాకనిపిస్తోంది. "ఏమిటి పార్వతీ! మళ్ళీ గుండెనొప్పా ?" ఆదుర్దాగా అడిగాడు మీదకు వంగి.

"ఊహూఁ!" పక్కకు వత్తిగిలి పడుకుంది.

"భగవాన్ !" అతగాడి కంఠస్వరంలో నిస్పృహ.

"గాబరా పడకండి ! నాకేం బాధలేదు !" నొచ్చుకుంటూ అంది.

"ప్చ ! నీ శరీరంమీద చెయ్యివేసి ఎన్నాళ్ళయింది పార్వతీ !" విసుగ్గా అడిగాడు విశ్వం.

పార్వతి మాట్లాడలేదు.

"ఇంత అపురూపంగా నిన్ను చూచు కొంటుంటేనే, ఇంత బలహీనంగా వున్నావు నువ్వు.... ఇక.... ఇక ఈ జన్మకు నీనుంచి నేను.... ఏలాటిసుఖమూ ఆశించలే ననుకుంటాను ....కదూ ?"

పార్వతి మాట్లాడలేదు.

"ఇక నాబ్రతుకు.... నాబ్రతుకు...." విశ్వం పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు, కాస్సేపయ్యాక, విసుగుతో కోపంతో నిస్సహాయంగా.... గదిలోకి వెళ్ళి తలుపువేసుకు పడుకున్నాడు ....వంటరిగా మిగిలి పోయిన పార్వతికి, తనమీద తనకే అసహ్యంగా వుంది, విశ్వం ప్రవర్తన దుస్సహంగానూ వుంది.

ఆమెలో ఆలోచనలు తిరిగీ విజృంభించాయి....

డాక్టర్ సలహాప్రకారం, తనో ఐదారు నెలలు పుట్టింట్లో వుండి వస్తానంది.... విశ్వం ససేమిరా అన్నాడారోజు.

"అదేమిటి పార్వతీ ! ఎవరైనావింటే నవ్విపోతారు ! ఆ మాత్రం నిగ్రహంలేనిచవటనా నేను ! అసలీ విషయం మూడోవాళ్ళకు తెలియవలసిన అవసరంఏముంది ? అసలు

అలా తెలియటం ఎంత అవమానం! నీ కేం భయంలేదు. నీ ఆరోగ్యం సరి అయ్యేంతవరకూ....నువ్వు మామూలు మనిషివి అయ్యేంత వరకూ....మనిద్దరం....నిజమైన స్నేహితులం.... ఆత్మీయులం....సరా!అంతేకాదు..నాసంస్కారంనీకు తెలుసు.. నీకు తప్ప నా ఈగుండెల్లో మరొకరి కిస్థానంలేదు, వుండబోదు.. నా ఈచేతులు....నీ శరీరాన్ని తప్ప.... మరొకర్ని .... ఛీ.... ఛీ....!"అలా కబుర్లు చెప్పిన విశ్వం....ఈ రోజెంత అశాంతితో బాధపడుతున్నాడు. విశ్వం ఒక్కడూనా? లేక మగాళ్లందరూ ఇంతేనా? భార్యతాత్కాలికంగా బలహీనమైతే, తాత్కాలికంగా కొంత కాలంపాటు "సెక్స్" జీవితం గడపకపోతే, ఇకామె తమజీవితసహచరిగా వుండదగదని నిస్పృహచెందుతారా? అప్పుడు "మరో భార్య" "మరో స్త్రీ" ఆలోచన ప్రారంభిస్తారా? అలాగే స్త్రీలు ఆలోచిస్తే?

విశ్వాని కా మధ్య మలేరియా....వదలకుండా రెండు నెలలు వేధించింది. షుమారు నాలుగు నెలలవరకూ అతగాడు మామూలు మనిషి కాలేకపోయాడు....సన్నగా పూచిక పుల్లలాటి కాళ్ళూ చేతులతో, పెరిగిన గడ్డంతో, ఎండిపోయిన గుండెలతో, ఎముకల ప్రోగులా, ఆయాసపడుతూండే అతగాణ్ని చూస్తున్నకొద్దీ, తనలో జాలి ముంచుకువచ్చేది! ఎన్నో వెన్నెల రాత్రులు, ఎన్నో కోర్కెలు గుండెలనిండా పొంగుతుంటే, నిగ్రహంతో అణచివేసుకొనేది. మంచానికంటుక పోయినట్లు నిద్రపోతూండే అతగాణ్ణిచూస్తూ"భగవాన్! ఈయనకు త్వరలో ఆరోగ్యం ప్రసాదించు!" అని మనసారా కోరుకొనేది, జాగ్రత్తగామందులిచ్చి, పథ్యం చూచేది. ఆసేవలో,

ఆ జాలి, ఆ ప్రార్థనలో ఏ ఒక్క-క్షణమూ అతగాడు సంపాదించి పెట్టేవాడన్న స్వార్థం గానీ, కోర్కెలు తీర్చే 'లైసెన్స్‌డ్' సాధనం అని గానీ—కల్మషం లేదు:

పాపం పార్వతీ ! హాయిగా మరెవరి నేనా కట్టుకొని వుంటే సుఖపడి వుండేదానివేమో! అర్భకుణ్ణి కట్టుకుని—సన్యాసినిలా కాలం వెళ్ళబుచ్చుతున్నావుగదూ !" అనేవాడు విశ్వం బాధతో.

"ఛీ-ఛీ....అవేంమాటలు ! ఇప్పుడునా కేమైంది ! మీకు మాత్రం ఏమిటి ? రాజాలా వున్నారు ! చక్కనమ్మ చిక్కినా అందమేనట !" అంటూ అతగాడు మానసికంగా నిరుత్సాహ పడకుండా ఎప్పటి కప్పుడు ఉత్సాహాన్నిచ్చేది ! అదే టానిక్‌లా పనిచేసి, పది రోజుల్లో, విశ్వం మామూలుమనిషై పోయాడు.

కానీ ఈరోజు! సరిగ్గా అందుకు భిన్నంగాజరుగుతోంది! ఇలా కాదు....దీనికో అంతం చూడాలి. రేపు తన ఫ్రెండ్ డాక్టర్ సుభద్రను నిలవేసి అడగాలి : తనకిక ఈ జన్మకు బలం వస్తుందో రాదో, తను ఆయనకు 'భార్య'గా వుండే అర్హత వుందో లేదో నిర్మొహమాటంగా చెప్పమనాలి.

అలాటి ఆశే లేకుంటే ఆయనగారినిక ఆయనగారికి నచ్చిన మార్గం చూచుకోమని తను తప్పుకోవాలి. తను చదువుకున్నది. ఏదో ఓ ఉద్యోగం చూచుకోవాలి....

"అమ్మో ! అయ్యో !"

పెద్ద గోలతో గబుక్కున లేచికూర్చుంది పార్వతి. గది లోంచి విశ్వం కూడా బయటకు వచ్చాడు. తెల్లవారుఝాము కావొస్తోంది. ఇద్దరూ అంతవరకూ నిద్ర పోలేదనటానికి చిహ్నంగా ఇద్దరి కళ్ళూ అగ్నిగోళాల్లావున్నాయి.

క్రింద వీధిలో ఏదో కోలాహలం....పిట్టగోడ దగ్గరకు పరుగెత్తారిద్దరూ.

ఎలక్షన్స్ ప్రచారం సందర్భంగా, ఓ పార్టీ మనిషిని అవతలి పార్టీ వాళ్ళు ఎత్తుకుదేశారు! అతగాడికి పైకి కనిపించే గాయంలేమీ తగల్లేదు. కానీ లోపల ఏమే కీళ్ళు పట్టు సడలి పోయాయో గానీ, లేచి నిల్చోలేక పోతున్నాడు. కొట్టిన వాళ్ళెవరో పారిపోయారు! అతగాడెవరో కాదు....విశ్వం ఆఫీసులోనే పని చేస్తున్న గోపాలరావు. నలభై యేళ్ళలోపువాడే!

"అసలు నీకెందుకయ్యా ఎలక్షన్స్ గొడవ!" అంటున్నారెవరో.

"రక్తం పైకికనిపిస్తే కేసవుతుందని కిరాతకులు ఈ పని చేశారు. గాయం కనిపించకుండా చావు దెబ్బ కొట్టారు! ఇకా నడుము సరిగా వస్తుందో రాదో!" తలకో రకంగా వ్యాఖ్యానిస్తున్నారు. తెల్లగా తెల్లారి పోయింది.

"ఈ రోజు నేను మా స్నేహితురాలు డాక్టర్ సుభద్రను చూచి వస్తాను!" అంది పార్వతి.

విశ్వం అభ్యంతరం చెప్పలేదు.

* * *

ఇందతా జరిగి సుమారు ఎనిమి దేళ్లు కావొస్తోంది. ఇప్పుడు పార్వతీ ఇద్దరు పిల్లల తల్లి అయింది. మీనాక్షి కంటే మరి రెండు చుట్లు లావుగా వుంది.

డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని "ఛీ....ఛీ.... విపరీతంగా లావెక్కి పోతున్నాను" అని పార్వతి అంటే, విశ్వం నవ్వేస్తాడు. "లేదు....లేదు. నిండుగా, హుందాగా, అందంగా వున్నావు" అంటాడు.

"అసలు నీ కంటే అందగత్తె లెవరున్నారు పార్వతీ! ఏమిటో ఆ దేవకి రుబ్బురోలులా, మా మీనాక్షి కాల్ టెక్స్ పీపాలా....ఛీ—ఛీ....చూడటానికి అసహ్యామని పిస్తారు. నువ్వు సరిగ్గా వున్నావు."

అలా విశ్వం అన్నప్పుడు పార్వతికి ఆనందమూ, గర్వమూ కలగటంలేదు. చప్పున గోపాలరావు గుర్తుకు వస్తాడు. అతగాడిప్పుడు పరిపూర్ణ ఆరోగ్యంతో వున్నాడు. కాని బాగా స్ట్రెయిట్‌గా నడువలేడు! డాక్టర్లకు కూడా అంతుబట్టని విధంగా, అతగాడిలోని ఎముక ఏదో విరిగి పోయిందానాడు. కనిపించని గాయం అది ....

తనలోనూ అలాటిగాయం ఒకటుందని విశ్వానికే నాడూ తెలిసే అవకాశం లేదు....

ఆ రోజుల్లో....తన శారీరకమైన బలహీనాన్ని విశ్వం అంతలా అసహ్యించు కోనకుండా వుండి వుంటే. తాత్కాలిక మైన ఎడబాటును సహనంతో ఎదుర్కొనగలిగి వుంటే. కనీసం

"నీ కేంపార్వతీ ! నువ్వుకోలుకుంటావు. త్వరలోనే....నీకు బలం వస్తుంది ! నీ మీదనుంచి నా మనస్సు మరలదు!" అన్న ప్రోత్సాహకరమైన చల్లని మాట ఒక్కటైనా అని వుంటే....

ఆనా డంతటి చిత్రహింస అనుభవించేది కాదేమో ! డాక్టరు సుభద్ర మందులూ, మందుల కంటే ఎక్కువైన ఓదార్పు. తిరిగి తనని మనిషిని చేశాయ్ !

విశ్వాని కీరోజు తను సర్వస్వం కావచ్చు....

కానీ తనలో వున్న ఆ కనిపించని గాయం.... ఏ నాడూ మానిపోదు !

("జ్యోతి" అక్టోబరు 71)